సాక్షి నంద్యాల

శుక్రవారం । 13 । జూన్ । 2025



థ్యాంక్యూ పోలీస్

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. గురువారం బాధితులను జిల్లా పోలీస్ కార్యాలయానికి పిలిపించి సెల్‌ఫోన్లను అందజేశారు. 8లో▸



బదిలీల్లో భారీ మార్పులు

వ్యవసాయాధికారుల బదిలీల్లో కూటమి నేతల సిఫార్సులు, పైరవీల వ్యవహారం సాగింది. దీంతో 11 మంది వ్యవసాయాధికారుల బదిలీల్లో మార్పు జరిగింది. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,602.81
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 25.411
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 6,180
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 96

న్యూస్‌రీల్

ప్యాపిలిలో 54.8 మి.మీ. వర్షం

నంద్యాల(అర్బన్): జిల్లాలో బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు వర్షం కురిసింది. ప్యాపిలి మండలంలో అత్యధికంగా 54.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. బేతంచెర్ల మండలంలో అత్యల్పంగా 1.2 మి.మీ. వర్షం కురిసింది. గడివేములలో 49.4, బండిఆత్మకూరు 41.6, శిరివెళ్ల 39.2, మిడుతూరు 36.4, నంద్యాల అర్బన్ 34.0, రుద్రవరం 31.0, పాణ్యం 25.2, డోన్ 23.4, కోవెలకుంట్ల 20.0, మహానంది 19.2, నంద్యాల రూరల్, బనగానపల్లె 18.2, ఉయ్యాలవాడ 14.8, శ్రీశైలం 12.4, గోస్పాడు 12.2, నందికొట్కూరు 9.4, ఆత్మకూరు 8.2, కొత్తపల్లి 7.2, పాములపాడు 5.8, జూపాడుబంగ్లా 5.6, సంజామల 5.2, వెలుగోడు, ఆళ్లగడ్డ 4.4, పగిడ్యాల, దొర్నిపాడు 3.8, కొలిమిగుండ్ల 3.4, అవుకు 1.4 మి.మీ. వర్షం కురిసింది.

పింఛన్ ఇప్పించండి మహాప్రభో!



ఎంపీడీఓ కార్యాలయం వద్ద అధికారుల కోసం వేచి చూస్తున్న లక్ష్మీదేవి

గోస్పాడు: తనకు పింఛన్ మంజూరు చేయాలని అధికారులను జూలేపల్లె గ్రామానికి చెందిన దేవాశెట్టి లక్ష్మీదేవి మొరపెట్టుకుంటున్నారు. పింఛన్ తీసుకునే ఈమె భర్త రెండు సంవత్సరాల క్రితం మృతి చెందారు. వితంతువు పింఛన్ కోసం గ్రామంలోని సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకుండా పోయింది. నంద్యాల కలెక్టరేట్‌లో సోమవారం జరిగే పీజీఆర్‌ఎస్‌లో వినతిపత్రం ఇవ్వగా గ్రామ సచివాలయ సిబ్బంది ఆమె ఇంటి వద్దకు వచ్చి వేలిముద్రలు వేయించుకున్నారు. ఇంత వరకు పరిష్కారం కాకపోవడంతో గురువారం గోస్పాడు మండల పరిషత్ కార్యాలయం వద్దకు వచ్చి అధికారుల కోసం వేచి చూశారు. అధికారులు వచ్చాక సమస్యను విన్నవించారు. తనకంటే వెనుక దరఖాస్తు చేసుకున్న వారికి పింఛన్లు మంజూరు అయినట్లు ఆమె చెప్పారు. తనకు న్యాయం చేయాలని కోరారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను ఈ నెల 13న(నేడు) ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జెడ్పీలోని మినీ సమావేశ భవనంలో నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఉత్తర్వుల మేరకు ఈ సమావేశాలను ఏర్పాటు చేశామన్నారు. సమావేశాలకు ఆయా స్థాయీ సంఘాల సభ్యులు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు తమకు కేటాయించిన సమయానికి తప్పక హాజరు కావాలని సీఈఓ కోరారు.

ముగిసిన ఏపీ పీజీసెట్

కర్నూలు కల్చరల్: ఏపీ పీజీసెట్-2025 గురువారంతో ముగిసింది. చివరి రోజు పరీక్షలకు 80 శాతం హాజరు నమోదైంది. ఉమ్మడి కర్నూలు జిల్లా కేంద్రంలో జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, దూపాడు సమీపంలోని ఐయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. సెషన్-1లో సైకాలజీ, జియోగ్రఫీ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ మధుసూదన్, డాక్టర్ రామలింగారెడ్డి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

మద్దిలేటి ఆలయానికి రూ.లక్ష విరాళం



కమిషనర్‌కు చెక్కు అందజేస్తున్న దాతలు

బేతంచెర్ల: మండల పరిధిలోని మద్దిలేటి నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి దాత విరాళం ఇచ్చారు. పాణ్యం మండలం కౌలూరు గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ మద్దిలేటి, ఆయన కుమార్తె డాక్టర్ సుహాసిని జ్ఞాపకార్థం రూ. లక్ష చెక్కును ఆలయ ఉప కమిషనర్ రామాంజనేయులుకు అందజేశారు. దాతకు స్వామి, అమ్మవార్ల దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామివారి పట్టు వస్త్రంతో సత్కరించారు.

అధ్వానంగా తరగతి గదులు



శిథిలావస్థలో ఉన్న ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల శిరివెళ్ల మండలం ఎర్రగుంట్లలో కనిపించింది. ఇక్కడ మొత్తం 86 మంది విద్యార్థులు 1 నుంచి 8వ తరగతి వరకు చదువుతున్నారు. కేవలం మూడు గదులు ఉన్నాయి. ఒక్కో గదిలో రెండు నుంచి మూడు తరగతులు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వం అదనపు గదుల నిర్మాణాలు చేపట్టినా ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేయలేదు. - శిరివెళ్ల

అమలు కాని మెనూ



మధ్యాహ్న భోజనంలో భాగంగా విద్యార్థులకు గురువారం గుడ్డుకర్రి, కూరగాయల అన్నం, రాగిజావ వండిపెట్టాల్సి ఉంది. అయితే పాఠశాలలకు గుడ్లు, రాగి పిండి, బెల్లం సరఫరా చేయలేదు. దీంతో రాగిజావ వండిపెట్టలేదు. జూపాడుబంగ్లా ఉన్నత పాఠశాలలో తెల్ల అన్నం, పప్పుచారు వండి వడ్డించారు. - జూపాడుబంగ్లా

నేలపైనే చదువులు



ఇది గోస్పాడు మండలంలోని బీవీనగర్ ప్రాథమిక పాఠశాల. తరగతులు ఐదు ఉన్నా ఇక్కడ ఒక్క టీచర్ మాత్రమే పనిచేస్తున్నారు. గురువారం కేవలం ఐదుగురు విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. ఉదయం 11గంటల వరకు టీచర్ రాలేదు. బెంచీలు లేకపోవడంతో విద్యార్థులు నేలపైనే కూర్చున్నారు. - గోస్పాడు

అవస్థలు బడి

- పూర్తి కాని అదనపు తరగతి గదులు
- అరకొరగా మధ్యాహ్న భోజనం
- అధ్వానంగా మరుగుదొడ్లు
- అందని పాఠ్యపుస్తకాలు
- పలుచగా విద్యార్థుల హాజరు

గణగణ మంటూ బెల్లు మోగింది.. విద్యార్థులు పరుగున పాఠశాలకు వెళ్లారు. ప్రతిజ్ఞ చేశారు. జాతీయ గీతాన్ని ఆలపించారు. తరగతికి వెళ్లాక వారికి దుస్థితి తెలిసింది. పాఠ్యపుస్తకాలు అందలేదు. బెంచీలు లేక నేలపైన కూర్చోవాల్సి వచ్చింది. ఉపాధ్యాయులు బెత్తాలు పట్టుకోకున్నా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మాత్రం విద్యార్థులు ఏడ్చేలా దెబ్బలు వేసింది. పాఠాలు చెప్పే ఉపాధ్యాయులను నియమించలేదు. అన్ని తరగతులకు వేర్వేరు గదులు లేవు. విద్యార్థులందరినీ ఒకే చోట కూర్చొనేలా చేసి గోడ కుర్చీలు వేయించింది. అన్ని పాఠశాలల్లో సౌకర్యాలు శీర్షాసనం వేశాయి. కనీసం మంచినీరు అందని దౌర్భాగ్యం.. ఫ్యాన్లు తిరగని వైనం.. మధ్యాహ్నం దొడ్డు బియ్యంతో చేసిన అన్నం.. వసతులు మరుగై విద్యార్థులందరూ కన్నీరు పెట్టే పాఠం అన్ని చోట్లా కనిపించింది.



నంద్యాల చాబోలు గ్రామంలోని ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చేతిపంపు వద్ద విద్యార్థుల ఇబ్బందులు

నంద్యాల(న్యూటౌన్): వేసవి సెలవులు పూర్తి కావడంతో గురువారం విద్యార్థులు బడిబాట పట్టారు. తొలి రోజు ఉదయం 8.30 గంటలకే బడి గంటలు మోగాయి. మధ్యాహ్నం 12.30 వరకు పాఠశాలలను నిర్వహించారు. జిల్లాలో మొత్తం 1,403 పాఠశాలలు ఉండగా వీటిలో 1,43,700 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మొదటిరోజు 7,06,805 పాఠ్యపుస్తకాలకు గాను 5,91,773 అందజేశారు. జిల్లాలోని పలు పాఠశాలలో అడ్మిషన్లు అంతంత మాత్రమే ఉన్నాయి. విద్యార్థులు అరకొరగా పాఠశాలలకు హాజరయ్యారు. నంద్యాల పట్టణంలోని మున్సిపల్ పాఠశాలల ఎదుట డ్రైనేజీలు దుర్వాసన రావడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నూనెపల్లె మున్సిపల్ హైస్కూల్‌లో నాడు-నేడు కింద మినరల్ వాటర్ ప్లాంట్ గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కుళాయిలు పని చేయక విద్యార్థులు దాహం తీర్చుకోలేక పోయారు.



జూపాడుబంగ్లా: మండ్లెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అందని కిట్లు



పాములపాడు: జెడ్పీ హైస్కూల్ తరగతి గదిలో రెక్కలు విరిగిన ఫ్యాన్



పాములపాడు: తరగతి గదిలో పెచ్చులూడిన పైకప్పు

అస్తవ్యస్తం

➡ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీచర్ పోస్టులు భర్తీ కాలేదు. విద్యా రంగం అస్తవ్యస్తమైంది. గత ప్రభుత్వంలో ప్రారంభించిన రెండో విడత నాడు-నేడు పనులను పక్కన పెట్టింది.

➡ పాఠశాలలు ప్రారంభమైన మొదటి రోజు మధ్యాహ్నం 12.30గంటలకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని అమలు చేశారు. విద్యార్థులు పలుచగా హాజరయ్యారు. ఎక్కడా మెనూ అమలు కాలేదు.

➡ జిల్లాలో పాఠశాలలు పునః ప్రారంభం రోజునే విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేయాల్సి ఉంది. కిట్లు అరకొరగా రావడంతో బ్యాగులు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు మాత్రమే పంపిణీ చేశారు. విద్యార్థులకు షూలు, బెల్ట్‌లు పంపిణీ చేయలేదు.

➡ బండిఆత్మకూరు, గడివేముల, కొత్తపల్లి, ఉయ్యాలవాడ తదితర మండలాల్లో పీఎంశ్రీ, కేజీబీవీ పాఠశాలల్లో మరుగుదొడ్ల మరమ్మతులు జరుగుతున్నాయి. పనులు పూర్తి కాకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందికరంగా మారింది.

➡ నంద్యాల పట్టణంలోని నూనెపల్లె మున్సిపల్ హైస్కూల్‌లో నాడు-నేడు కింద అదనపు గదుల నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో సుమారు 200 మంది విద్యార్థులు ఇరుకు గదుల్లోనే ఉన్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యే సరికి అదనపు గదులు పూర్తవుతాయని విద్యార్థుల సమస్య పరిష్కారమవుతుందని అందరూ భావించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు పనులు పూర్తి చేయలేదు. విద్యార్థులు గురువారం ఇరుకు గదుల్లో కూర్చొని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది.

➡ రక్షిత మంచినీరు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో నాడు-నేడు పథకం కింద మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసినా అవి ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు మంచినీరు కోసం ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్ని పాఠశాలలో రక్షిత మంచినీరు శుద్ధి కావడం లేదు. విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది.

మధ్యాహ్న భోజనంలో కోత



పాఠశాలల పునఃప్రారంభం రోజే మధ్యాహ్న భోజనం పథకంలో కోత విధించారు. మెనూ ప్రకారం కూరగాయల అన్నం, ఆలు కూర్మా, ఉడికించిన కోడిగుడ్డు, వేరుశనగ బెల్లం, చెక్కీ, విద్యార్థులకు వడ్డించాలి. అయితే కూరగాయల అన్నం, ఆలుకూర్మతోనే విద్యార్థులకు భోజనం పెట్టి సరిపెట్టారు. కోడిగుడ్డు, బెల్లం చిక్కీ రాకపోవడంతో విద్యార్థులు అసహనం వ్యక్తం చేశారు.

\- మధుగోపాల్, నంద్యాల

అదనపు గదులు పూర్తి కాలేదు



నూనెపల్లె మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు అదనపు తరగతి గదులు పూర్తి కాలేదు. విద్యాభివృద్ధికి గత ప్రభుత్వం నాడు-నేడు కింద నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో అదనపు గదుల నిర్మాణ పనులు చేపట్టారు. పాఠశాలలు పునః ప్రారంభమైనా అదనపు గదుల నిర్మాణం పూర్తి కాలేదు. విద్యార్థులు ఇరుకు గదుల్లోనే విద్యను అభ్యసిస్తున్నారు. - లింగన్న, నంద్యాల

ఇవీ ఇబ్బందులు..

- శ్రీశైలం నియోజకవర్గంలో పాఠశాలలకు విద్యార్థులు పూర్తిస్థాయిలో రాలేదు. పుస్తకాల పంపిణీ జరగలేదు.
- నందికొట్కూరు నియోజకవర్గంలోని కొన్ని పాఠశాలలకు ఉపాధ్యాయులు రాలేదు. చాలా పాఠశాలలో ఫ్యాన్లు పని చేయలేదు.
- బనగానపల్లె పట్టణంలోని పాఠశాలలోని మినరల్ వాటర్ ప్లాంట్ పని చేయలేదు. కోవెలకుంట్లలో విద్యార్థుల హాజరు శాతం మొదటి రోజే తగ్గింది. అవుకులో ఇరుకు గదుల్లో బెంచీలు లేక విద్యార్థులు కింద కూర్చోవాల్సి వచ్చింది.
- ఆళ్లగడ్డ నియోజకవర్గంలో నామమాత్రంగా విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేశారు. వచ్చిన విద్యార్థుల వరకే మధ్యాహ్న భోజనాన్ని అందజేశారు.
- పాణ్యం నియోజకవర్గంలో మొదటి రోజు ప్రారంభమైన పాఠశాలకు పిల్లలకు తక్కువ శాతం హాజరయ్యారు.
- డోన్ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో తరగతికి నలుగురు నుంచి ఐదుగురు మాత్రమే హాజరయ్యారు. ఇంత వరకు షూస్, సాక్సులు రాలేదని విద్యాశాఖ అధికారులు తెలిపారు.
- ఉపాధ్యాయులు లేక, విద్యార్థులు రాక నంద్యాల నియోజకవర్గంలో పాఠశాలలు వెలవెలబోయాయి. చాలా పాఠశాలల ఆవరణాల్లో వర్షపునీరు నిలిచి అపరిశుభ్రత కనిపించింది.



ముళ్ల పొదల మధ్య మరుగుదొడ్లు



అవుకు: జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కొన్ని రోజులుగా పనిచేయని ఆర్‌ఓ ప్లాంట్



ఆత్మకూరు: కప్పలకుంట్ల ప్రాథమిక పాఠశాల తరగతి గదిలో మొదటి రోజు హాజరైన ఏకైక విద్యార్థి

పదివేల మందితో 16న యోగా

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈనెల 16న పదివేల మందితో యోగా కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. అధికారులతో గురువారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల 16న నిర్వహించే యోగా కార్యక్రమాల్లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ భాగస్వామ్యం కావాలన్నారు. యోగ నిర్వహణ నేపథ్యంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఉదయం 10.30 గంటలకు ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

యోగా పాటకు బహుమతి

యోగా సంగీత విభావరికి తెలుగు, హిందీ, ఆంగ్లంలో పాటను రూపొందించిన వారికి లక్ష రూపాయలు నగదు బహుమతిని రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందని జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. జిల్లాలో స్థాయిలో ఎంపికైన పాటలను రాష్ట్రస్థాయికి పంపుతామని చెప్పారు.

‘అన్నదాత సుఖీభవ’లో అడ్డగోలు కోతలు



కర్నూలు(అగ్రికల్చర్): అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయం అందించడంలో కూటమి ప్రభుత్వం రైతులకు భారీగా కోతపెడుతోంది. గత వైఎస్సార్‌సీపీ పాలనలో అర్హత కలిగిన ప్రతి రైతుకు వైఎస్సార్ రైతుభరోసా కింద పెట్టుబడి సాయం అందించింది. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన మొదటి ఏడాది 2019-20 నుంచే రైతుభరోసా కింద పెట్టుబడి సాయం ఇవ్వడం విశేషం. 2019-20 నుంచి 2023-24 వరకు ప్రతి ఏటా లబ్ధిపొందే రైతుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. కూటమి ప్రభుత్వం మాత్రం అన్నదాత సుఖీభవ కింద లబ్ధిపొందే రైతుల సంఖ్యను భారీగా కోతవేయడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. 2024 మే నెలలో జరిగిన ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సూపర్-6లో భాగంగా రైతులకు ఏటా రూ.20 వేలు చెల్లిస్తామని ఊరూవాడ ప్రకటించారు. చంద్రబాబు మాటలను నమ్మిన రైతులు కూటమి పార్టీలకు అండగా నిలిచారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు రైతుల సంక్షేమాన్ని విస్మరించారు. 2024-25లో రైతులకు అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయానికి మంగళం పలికారు. 2025-26 సంవత్సరంలో అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయం అందించే కార్యక్రమాన్ని చేపట్టింది. అయితే రైతుల సంఖ్యను భారీగా తగ్గించడం గమనార్హం.

38,755 మంది రైతులకు మొండిచేయి

గత వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం 2023-24లో వైఎస్‌ఆర్ రైతుభరోసా కింద 2,94,598 మంది రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించింది. కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద జిల్లాల వారీగా అర్హత కలిగిన రైతుల జాబితాలను విడుదల చేసింది. కర్నూలు జిల్లాలో పెట్టుబడి సాయానికి అర్హత పొందిన రైతులు 2,55,843 మాత్రమే ఉన్నారు. 2023-24 సంవత్సరంలో పెట్టుబడిసాయం పొందిన రైతుల సంఖ్యతో పోలిస్తే ఇప్పుడు 38,755 మంది రైతులకు మొండిచేయి చూపుతుండటం గమనార్హం. ఎన్నికల సమయంలో పీఎం కిసాన్‌తో సంబంధం లేకుండా రూ.20 వేల పెట్టుబడిసాయం రైతులకు ఇస్తామని ప్రకటించిన చంద్రబాబు, ఇప్పుడు పీఎం కిసాన్‌తో కలిపి ఇవ్వడానికి రంగం సిద్ధం చేశారు. కటుంబంలో ఎంతమందికి భూములు ఉంటే ప్రతి ఒక్కరికీ రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తామన్నారు. ఇప్పుడు కుటుంబం యూనిట్‌గానే అమలుకు సిద్ధమయ్యారు.

ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకోవాల్సిందే...

అన్నదాత సుఖీభవ కింద లబ్ధి పొందే రైతుల సంఖ్యను మరింత తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. పెట్టుబడి సాయం పొందాలంటే ప్రతి రైతు ఆర్‌బీకేల్లో బయో మెట్రిక్ ద్వారా ఈ-కేవైసీ చేయించుకోవాల్సి ఉంది. ఈ-కేవైసీ చేయించుకుంటేనే రైతులకు పెట్టుబడి సాయం అందనుంది.

‘ఓపెన్’ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): ఏపీ ఓపెన్ స్కూల్‌లో పది, ఇంటర్మీడియెట్ అడ్మిషన్లు పొందడానికి దరఖాస్తు చేసుకోవచ్చని డీఈఓ జనార్దన్‌రెడ్డి గురువారం సాయంత్రం తెలిపారు. పదిలో చేరేందుకు 14 సంవత్సరాలు, ఇంటర్‌లో చేరేందుకు 15 సంవత్సరాలు నిండిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో జూలై 30లోగా దరఖాస్తు చేయాలని, అడ్మిషన్ ఫీజు జూలై 31లోగా చెల్లించాలన్నారు.

‘పది’ సప్లిమెంటరీ ఫలితాలు...

పదోతరగతి సప్లిమెంటరీ పబ్లిక్ పరీక్షల్లో 90.87శాతం మంది విద్యార్థులు పాస్ అయినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో బాలురు 2709 మందికి గాను 2405 మంది, బాలికలు 1803 మందికి గాను 1695 మంది ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు.

క్లుప్తంగా

నేడు యువజన, విద్యార్థి విభాగాల నిరసన కార్యక్రమం వాయిదా

కర్నూలు(టౌన్): అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదం నేపథ్యంలో ఈనెల 13న శుక్రవారం వైఎస్సార్‌సీపీ యువజన విభాగం, విద్యార్థి విభాగం సంయుక్త ఆధ్వర్యంలో కర్నూలు నగరంలో నిర్వహించతలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే వెల్లడిస్తామన్నారు. కాగా విమాన ప్రమాద ఘటన బాధాకరమైందని, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఘటనలో వైద్య విద్యార్థులు చనిపోవడం మరింత కలచి వేసిందన్నారు. ఇలాంటి విషాద ఘటన సమయంలో నిరసనలు, ర్యాలీలు చేయడం మంచిది కాదని భావించి కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం, విద్యార్థి విభాగం నాయకులు గమనించాలని ఆయన పేర్కొన్నారు.

మైనారిటీ విద్యార్థులకు హాస్టళ్లలో ప్రవేశాలు

కర్నూలు(అర్బన్): 2025–26 విద్యా సంవత్సరానికి జిల్లాలోని దూర ప్రాంతాలకు చెందిన మైనారిటీ విద్యార్థులు(బాలురు, బాలికలు) నగరంలోని హాస్టళ్లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి ఎస్.సబీహా పర్వీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులకు ప్రత్యేకంగా వసతి గృహాలు ఉన్నాయని, నగరంలోని వివిధ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పోస్టుమెట్రిక్ వసతి గృహం ఉందన్నారు. అర్హులైన విద్యార్థులు 94408 22219ను సంప్రదించాలన్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు చదువు తున్న బాలికల ప్రీమెట్రిక్ వసతి గృహంలో అర్హులైన వారు 90302 62833 ను సంప్రదించాలన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి...



కోడుమూరు రూరల్: కోడుమూరు – కర్నూలు రహదారి పక్కన పొలాల్లో గురువారం ఉదయం సంచరిస్తున్న జింకపై కుక్కలు మూకుమ్మడిగా దాడి చేసి చంపేశాయి. మృతిచెందిన జింకను చూసిన స్థానికులు అటవీ శాఖాధికారులకు సమాచారమిచ్చారు. బీట్ ఆఫీసర్ రేణుక సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. అనంతరం పశువైద్యాధికారి చేత జింక కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించి అనంతరం దహనం చేశారు.

విద్యార్థి అదృశ్యం



సుభాష్ చంద్ర బోస్ (ఫైల్)

ఆలూరు రూరల్: పెద్దహోతూరు గ్రామానికి చెందిన 8వ తరగతి విద్యార్థి రెండు రోజులుగా కనిపించడం లేదు. ఎస్‌ఐ మహబూబ్ బాషా తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మహానంది, లీలావతి దంపతుల కుమారుడు సుభాష్ చంద్రబోస్ ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు క్రికెట్ ఆడుకుంటానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. తల్లిదండ్రులు వారి బంధువుల ఇళ్లలో విచారించారు. చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహబూబ్ బాషా తెలిపారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు 9121101158కు సమాచారం ఇవ్వాలన్నారు.

నీటి కోసం వెళ్తుండగా..

పాణ్యం: నీటి కోసం వెళ్తున్న ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. సుగాలిమెట్టలో విద్యుత్ అంతరాయంతో నీటి సమస్య ఏర్పడుతోంది. బాలునాయక్ అనే వ్యక్తి నీటి కోసం బైక్‌పై పాణ్యం వస్తుండగా ఎస్సార్బీసీ కాల్వపై వద్ద వెనుక వస్తున్న ఓ కారు ఢీకొనడంతో గాయాలపాలయ్యాడు. హైవే పోలీసులు క్షతగాత్రుడిని నంద్యాల ఆసుపత్రికి తరలించారు.



ఫోన్ అందుకున్న బాధితులతో అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా

థ్యాంక్యూ పోలీస్!

- పోగొట్టుకున్న ఫోన్లు బాధితులకు అందజేత
- రూ.1.30 కోట్ల విలువైన 604 సెల్‌ఫోన్లు రికవరీ
- ఆనందం వ్యక్తం చేసిన బాధితులు

కర్నూలు: ప్రయాణాలు, జనరద్దీలో పొరపాటున జారిపోవడం, దొంగలు అపహరించడం వంటి సంఘటనల్లో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేయడంలో జిల్లా పోలీసులు సత్తా చాటుతున్నారు. లాస్ట్ మొబైల్ ట్రాకింగ్ అప్లికేషన్ ద్వారా బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోయిన సెల్‌ఫోన్ ఇతర రాష్ట్రాలు, జిల్లాల్లో ఎక్కడున్నా పట్టేస్తున్నారు. గత నాలుగేళ్లలో రూ.20 కోట్ల విలువ చేసే లక్షకు పైగా సెల్‌ఫోన్లు రికవరీ చేయగా విక్రాంత్ పాటిల్ ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రెండో విడత రూ.1.30 కోట్ల విలువ చేసే 604 సెల్‌ఫోన్లు రికవరీ చేశారు. గురువారం బాధితులను జిల్లా పోలీసు కార్యాలయానికి పిలిపించి అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా చేతుల మీదుగా అందజేశారు. ఫోన్ పోగొట్టుకున్న వారిలో పలువురు ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు, రైతులు, మహిళలు, ఇతర వర్గాల వారు ఉన్నారు. తక్కువ వ్యవధిలో మూడు, నాలుగేళ్ల క్రితం పోగొట్టుకుని ఆశ వదులుకున్న వారి చేతికి మొబైల్ రికవరీ మేళాలో ఫోన్ అందడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఎస్పీతో పాటు జిల్లా పోలీసులు, సైబర్ ల్యాబ్ సిబ్బందికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ఒక్క రోజే 54 సెల్‌ఫోన్లను రికవరీ చేసిన కర్నూలు సబ్ డివిజన్ హెడ్ కానిస్టేబుల్ శేఖర్ బాబును అడిషనల్ ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, కర్నూలు ఇన్‌చార్జ్ డీఎస్పీ శ్రీనివాసాచారి, సీఐలు నాగరాజ రావు, రామయ్య నాయుడు, సైబర్ ల్యాబ్ సీఐ వేణుగోపాల్, టెక్నికల్ టీమ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే ఫిర్యాదు చేయండి..

మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నవారు వెంటనే కర్నూలు పోలీస్ వెబ్‌సైట్‌కు http://kurnoolpolice.in/mobiletheft ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా తెలిపారు. పోగొట్టుకున్న మొబైల్ ఐఎంఈఐ వివరాలతో పాటు ప్రస్తుతం వాడుతున్న సెల్‌ఫోన్ నెంబర్, వివరాలు పొందుపరచాలి. పోలీసు సేవలకు ఎలాంటి రుసుం ఉండదని అడిషనల్ ఎస్పీ తెలిపారు.

వైద్యసేవ అమలులో జీజీహెచ్‌కు మొదటి స్థానం



సమావేశంలో మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్యసేవ పథకం కింద మే నెలలో 3,353 మంది రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించిన రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచామని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, ప్రొఫెసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో ఎన్‌టీఆర్ వైద్య సేవ కింద సేవలు అందించినందుకు అన్ని విభాగాధిపతులకు అభినందనలు తెలిపారు. ఈ–హాస్పిటల్ అమలు చేయడానికి పూర్తిస్థాయిలో సమీక్షించారు. రెగ్యులర్‌గా ప్రతి విభాగ ఓపీ, ఐపీ, డిశ్చార్జ్ వివరాలను ఈ–హాస్పిటల్‌లో అప్‌లోడ్ చేయడానికి హౌస్‌సర్జన్లు, పీజీలు, నర్సింగ్ సిబ్బంది సేవలు వినియోగించుకునేలా చూసుకోవాలన్నారు. ప్రతిరోజూ ఈ–హాస్పిటల్ అమలు, పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ వైద్యసేవలు ప్రజలకు చేరువ చేయాలని, ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్‌లోని ఆరు అంశాలపై కాల్స్, వాట్సాప్, క్యూ ఆర్ కోడ్ ద్వారా ఫీడ్ బ్యాక్ తీసుకుంటుందని, ఇందుకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని హెచ్‌ఓడీలకు సూచించారు. ఆసుపత్రిలో సెక్యూరిటీ సేవలను మరింత పటిష్టంగా అమలు చేస్తామన్నారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలు పరిశుభ్రంగా ఉండేటట్లు చూసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని పారిశుధ్య సిబ్బందికి ఆదేశించినట్లు తెలిపారు. ఓపీ విభాగాల్లో సమయపాలన పాటించాలని, లేకపోతే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని వైద్యులకు హెచ్చరించారు. సమావేశంలో సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, హెచ్‌ఓడీలు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ హరిచరణ్, డాక్టర్ విజయానందబాబు, డాక్టర్ రాధారాణి, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ మాధవి శ్యామల, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ముందస్తు క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలి



అవగాహన పత్రాలు విడుదల చేస్తున్న జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు

మద్దికెర: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ముందస్తు క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు అన్నారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలను గురువారం ఆయన సందర్శించి అసంక్రమిత వ్యాధులపై అవగాహన కల్పించారు. జీవన వ్యవహార శైలిలో వచ్చిన మార్పులతో ఎక్కువ మంది అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. రక్తపోటు, షుగర్, క్యాన్సర్‌తో పాటు ఇతర వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. వ్యాయామం లేకుండా ఒకే చోట ఉంచి పనులు చేయడం వల్ల ఆరోగ్యం పాడవుతుందన్నారు. ఆహారంలో ఉప్పు తగ్గించుకోవాలన్నారు. పచ్చళ్లు, నిల్వ వుంచిన పదార్థాలను పూర్తిగా తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి, సీహెచ్‌ఓ నిరంజన్ బాబు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ అక్బర్‌బాషా, ఆరోగ్య పర్యవేక్షకులు సూర్యనారాయణ పాల్గొన్నారు.

పిల్లలతో పని చేయిస్తే జైలుశిక్ష



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జడ్జి, అధికారులు

కర్నూలు(అర్బన్): పిల్లలతో పని చేయిస్తే ఆరు నెలల నుంచి రెండు సంవత్సరాల పాటు జైలు శిక్ష విధిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి అన్నారు. గురువారం స్థానిక న్యాయ సేవా సదన్‌లో బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులను పనిలోకి అనమతించడం, పని చేయించుకోవడం పూర్తిగా నిషేధమని, చట్టాన్ని ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టప్రకారం శిక్షలు ఉంటాయన్నారు. శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్ మాట్లాడుతూ బాల బాలికలతో షాపులు, ఫ్యాక్టరీలు, ఇతరత్రా వాణిజ్య కేంద్రాల్లో పని చేయించుకోవడం నేరమన్నారు. ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే వెంటనే 1098 లేదా లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100కు కాల్ చేసి తెలియజేయాలన్నారు. ఈ నేపథ్యంలోనే బాల కార్మిక వ్యతిరేక దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించి, న్యాయ సేవా సదన్ నుంచి కొండారెడ్డిబురుజు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కర్నూలు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హరినాథ్‌చౌదరి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆఫీసర్ సాంబశివరావు, డీసీపీఓ శారద, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ జుబేదా బేగం తదితరులు పాల్గొన్నారు.

వీరజవాన్ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే ఆర్థిక సహాయం



మురళీ నాయక్ కుటుంబానికి ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: సత్యసాయి జిల్లా వీర జవాన్ మురళీ నాయక్ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ ఆదోని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. గురువారం ఆయన గోరంట్ల మండలం కల్లితండాలో వీర జవాన్ మురళీనాయక్ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మురళీనాయక్ సమాధి వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీర జవాన్ మురళీనాయక్ జీవితం స్ఫూర్తి దాయకమన్నారు. దేశం కోసం పోరాడుతూ వీరమరణం పొందిన మురళీనాయక్ ఆత్మకు శాంతి కలగాలన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఎర్రిస్వామి తదితరులు ఉన్నారు.

వ్యవసాయ అధికారుల బదిలీల్లో భారీగా మార్పులు

- కొత్త పోస్టుల్లో చేరిన కొద్దిగంటల్లోనే మరో చోటుకు బదిలీ



కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయాధికారుల బదిలీల్లో పైరవీలు, కూటమి పార్టీల నేతల సిపారసులు, ముడుపుల వ్యవహారం కొనసాగుతోంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా వ్యవసాయ అధికారుల బదిలీల్లో ముడుపులకు తెరలేపడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నెల 10వ తేదీ ఉదయమే వ్యవసాయ అధికారుల బదిలీ ఉత్తర్వులు వెలువడ్డాయి. పనిచేస్తున్న స్థానాల నుంచి తక్షణం రిలీవ్ అయి కొత్త పోస్టుల్లో చేరాలని ఆదేశాలు ఇచ్చారు. ఇందుకు అనుగుణంగా వ్యవసాయ అధికారులు కొత్త స్థానాల్లో చేరిపోయారు. అయితే పలువురు పెద్ద ఎత్తున పైరవీలు చేసి ముడుపులు ముట్టచెప్పడంతో కొద్దిగంటల్లోనే బదిలీల్లో భారీగా మార్పులు చోటు చేసుకోవడం గమనార్హం. పరిపాలనా సౌలభ్యం కింద ఒకరిద్దరి స్థానాల్లో మార్పులు జరుగడం సహజం. అలాంటిది 11 మంది వ్యవసాయాధికారుల బదిలీల్లో మార్పులు జరగడం చర్చనీయాంశమవుతోంది. కొత్త పోస్టులో చేరిన కొద్ది గంటల్లోనే మరో పోస్టులో చేరాల్సి రావడం పట్ల వ్యవసాయ అధికారులు భగ్గుమంటున్నారు.

వ్యవసాయ అధికారుల బదిలీల్లో మార్పులు ఇలా..

పేరు	ఈ నెల 10న బదిలీ అయిన స్థానం	తాజాగా జరిగిన మార్పు
శ్రీవర్ధన్‌రెడ్డి	కర్నూలు ఏడీఏ ఆఫీసు టెక్నికల్ ఏవో	గుత్తి టెక్నికల్ ఏవో
మంజుల	గుత్తి టెక్నికల్ ఏవో	కర్నూలు ఏడీఏ ఆఫీసు
రామకృష్ణ	కర్నూలు భూసార పరీక్ష కేంద్రం	నంద్యాల డీఏవో ఆఫీసు
కిశోర్‌కుమార్	కర్నూలు డీఏవో ఆఫీసు	నంద్యాల డీఏవో ఆఫీసు
ఉషారాణి	బదిలీ లేదు	దేవనకొండ
సురేష్	బదిలీ లేదు	తుగ్గలి
మణిమాలిక	ఆదోని టెక్నికల్ ఏవో	కర్నూలు డీఏవో ఆఫీసు
జయలక్ష్మి	బదిలీ లేదు	ఆదోని టెక్నికల్ ఏవో
వెంకటేశ్వరరెడ్డి	సీడ్‌టెస్టింగ్‌ల్యాబ్ ఎమ్మిగనూరు	నంద్యాల డీఆర్‌సీ
మురళీధర్	ఉయ్యాలవాడ	పగిడ్యాల
శ్రీనివాసరెడ్డి	పగిడ్యాల	ఉయ్యాలవాడ

కౌన్సెలింగ్‌లో సాంకేతిక సమస్యలు

- కేంద్రం వద్దే ఉపాధ్యాయుల బస

కర్నూలు (సిటీ): ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ సాంకేతిక సమస్యల కారణంగా ఆలస్యంగా కొనసాగుతోంది. గురువారం సీనియారిటీ జాబితాలోని సీరియల్ నెంబర్ 1101 నుంచి 2000 వరకు కౌన్సెలింగ్‌కు పిలిచారు. బదిలీల ప్రక్రియ మొదలైన సమయంలో జారీ చేసిన జీవోలో ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. అయితే ఎస్‌జీటీ టీచర్లు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉపాధ్యాయ వర్గాల నుంచి తీవ్ర ఒత్తిడి రావడంతో సెకండ్ గ్రేడ్ టీచర్లకు మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ ప్రక్రియ ప్రతిరోజూ సీనియారిటీ జాబితా వచ్చిన తర్వాత మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో ప్రారంభిస్తున్నారు. దీనివలన ఉపాధ్యాయులు సీనియారిటీ జాబితాలో తమ నంబర్ వచ్చేంత వరకు రాత్రుల్లో సిల్వర్‌జూబ్లీ కాలేజీ ఆవరణలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కౌన్సెలింగ్ కేంద్రం దగ్గర బెడ్షీట్లు తెచ్చుకుని నిద్రపోతున్నారు. వెబ్‌సైట్‌లో తరచుగా సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటం, ఒక్కో టీచర్‌కి కనీసం 10 నుంచి 20 నిమిషాల సమయం పడుతుండటంతో కౌన్సెలింగ్ మరింత ఆలస్యమవుతోంది.



కౌన్సెలింగ్ కేంద్రంలో నిద్రపోతున్న టీచర్లు

నిర్లక్ష్యం గడ్డ కట్టి.. సమస్య వెక్కిరించి!



అసంపూర్తిగా నిలిచిపోయిన మరుగుదొడ్ల నిర్మాణం

జూపాడుబంగ్లా: గత వైఎస్సార్‌సీపీ పాలనలో విద్యా వ్యవస్థకు పెద్ద పీటవేసి నాడు–నేడు పథకం కింద గ్రామాల్లోని పాఠశాలలను కార్పొరేట్ స్థాయి పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తుందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. నాడు–నేడు రెండో విడత కింద చేపట్టిన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయకపోవటంతో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోవటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తంగడంచ ఉర్దూ ప్రాథమిక పాఠశాలకు నాడు–నేడు రెండోవిడత కింద రూ.12 లక్షలతో టాయ్‌లెట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు గత ప్రభుత్వం రూ.3 లక్షల నిధులతో పాటు తలుపులు, విద్యుత్ సామగ్రి, లెట్రిన్‌బేషిన్లు, సిమెంట్ మంజూరు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మిగతా నిధుల మంజూరు నిలిచిపోవడంతో ఎక్కడికక్కడ పనులు నిలిచిపోయాయి. పనుల కోసం తెచ్చిఉంచిన 40 సంచుల సిమెంటు బస్తాలు గడ్డకట్టిపోయాయి. ఈ విషయమై పాఠశాల హెచ్‌ఎం జాకీర్‌ను వివరణ కోరగా రూ.12 లక్షలతో పాఠశాలకు టాయ్‌లెట్లు మంజూరయ్యాయి. రూ.3లక్షల నిధులు మంజూరు కాగా పనులు ప్రారంభించాం. ప్రభుత్వం మారిన తర్వాత నిధులు మంజూరు కాకపోవటంతో పనులు నిలిచిపోయాయి. నిధులు మంజూరైతే మళ్లీ పనులు ప్రారంభిస్తామని తెలిపారు.



గడ్డకట్టి నిరుపయోగంగా మారిన సిమెంటు బస్తాలు



గత ప్రభుత్వం మంజూరు చేసిన తలుపులు, ఎలక్ట్రికల్ సామగ్రి

కుక్కల దాడిలో 26 గొర్రె పిల్లలు మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రె పిల్లలు

పెద్దకడబూరు: చిన్నకడబూరులో గురువారం సాయంత్రం కుక్కల దాడిలో 26 గొర్రె పిల్లలు మృతి చెందాయి. బాధితుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన నాగయ్యగారి ఈరన్న, దొడ్డి తిమ్మారెడ్డి, పశువుల తిక్కయ్య జీవాల పెంపకం చేపట్టారు. ఎప్పటిలాగే బుధవారం రాత్రి దొడ్డిలో నిలుపుకున్న వారు గురువారం ఉదయం పిల్లలను దొడ్డిలో ఉంచి మందను మేతకు తీసుకెళ్లారు. కాపలా ఉన్న ఇద్దరు కంచెను అడ్డువేసి ఇంటికి వెళ్లిపోయారు. సాయంత్రం 3గంటల సమయంలో అటుగా వచ్చిన నాలుగు కుక్కలు దొడ్డిలోకి దూకి గొర్రె పిల్లలపై దాడికి తెగబడ్డాయి. దాదాపు 55 పిల్లలకు పైగా ఉన్న గొర్రె పిల్లల మందపై దాడి చేయగా వాటిలో నాగయ్యగారి ఈరన్నకు చెందిన 14, దొడ్డి తిమ్మారెడ్డికి చెందిన 6, పశువుల తిక్కయ్యకు చెందిన 6 గొర్రెపిల్లలు మొత్తం 26 అక్కడికక్కడే మృతి చెందాయి. సాయంత్రం దొడ్డి దగ్గరకి వెళ్లిన బాధితులు మృతి చెందిన గొర్రె పిల్లలను చూసి నిర్ఘాంతపోయారు. స్థానికుల సహాయంతో దాడి చేసిన రెండు కుక్కలను చంపేశారు. కుక్కల దాడిలో తమకు రూ. 1.50 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.





కొండా రెడ్డి బురుజు వద్ద యోగాసనాలు వేస్తున్న దృశ్యం

యోగాసనం.. 'కొండ'ంత ఆరోగ్యం

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం నగరంలోని చారిత్రాత్మక కట్టడమైన కొండారెడ్డి బురుజు వద్ద యోగా శిక్షకుల ఆధ్వర్యంలో పలువురు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా ఈనెల 17వ తేదీన 5 వేల మంది మున్సిపల్ కార్మికులతో అవుట్‌డోర్ స్టేడియంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రపంచ యోగా దినోత్సవంలో భాగంగా ఈనెల 21న నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనేందుకు 10.70 లక్షల మంది నమోదు చేసుకున్నారని సెట్కూరు సీఈవో వేణుగోపాల్ తెలిపారు. జిల్లా యోగా అసోసియేషన్ చిన్నారులు అడ్వాన్స్ యోగా, ఆర్టిస్టిక్ పెయిర్ యోగాను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కమాండెంట్ ప్రసాద్, జిల్లా టూరిజం అధికారి యోగా కార్యక్రమాల ఇన్‌చార్జ్ విజయ, ఆయుష్ డాక్టర్ ప్రసాద్, మోప్మా పీడీ నాగశివలీల, యోగా అసోసియేషన్ కార్యదర్శి అవినాస్ పాల్గొన్నారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, కర్నూలు





శ్రీశైలం ఎస్ఈకి సీఈగా పదోన్నతి

- కర్నూలు రెగ్యులర్‌గా ఎస్ఈగా బాల చంద్రారెడ్డి

కర్నూలు సిటీ: శ్రీశైలం ప్రాజెక్టు పర్యవేక్షక ఇంజినీర్‌గా పని చేస్తున్న పి.శ్రీరామచంద్రమూర్తికి జల వనరుల శాఖ వైఎస్ఆర్ కడప ప్రాజెక్టు సీఈగా పదోన్నతి కల్పించారు. అలాగే కర్నూలు సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న డిప్యూటీ ఎస్ఈ బాల చంద్రారెడ్డికి పదోన్నతి కల్పించి రెగ్యులర్ ఎస్ఈగా నియమించారు. ఈ మేరకు జల వనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సాయి ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నీరు–చెట్టు పథకంలో భారీగా అక్రమాలు చోటు చేసుకోవడంతో గత ప్రభుత్వం 2020 విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం విచారణ చేసి అక్రమాల విషయంపై ఈ ఇద్దరిపై చార్జ్‌మెమోలు నమోదు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సాగు నీటి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు, అపెక్స్ సభ్యులుగా పని చేసిన ఆళ్ల వెంకట గోపాలకృష్ణరావు 'గత ప్రభుత్వం బిల్లుల ఇవ్వలేదు..దీంతో పాటు మంచి ఉద్దేశంతో చేపట్టిన పనుల్లో భాగస్వాములు అయిన ఇంజినీర్లపై చార్జ్‌మోమోలు ఉన్నాయని, వెంటనే తొలగించండి' అని కోరడంతో ఈ ఏడాది మార్చిలో ప్రత్యేక మోమో జారీ చేసి చార్జెస్‌ను తొలగించారు. దీంతో వారి పదోన్నతులకు అడ్డుగా ఉన్నటువంటి చార్జ్‌మోమోలు రద్దు కావడంతోనే ఈ ఇద్దరికి పదోన్నతులు దక్కాయి.